సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 31 । మార్చి । 2024



హర.. హర మహాదేవ

వేములవాడ: రాజన్న ఆలయంలో కొనసాగుతున్న శివకల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవుల ఖడ్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది(సా॥)	సహర్ సోమ(ఉ॥)
కరీంనగర్	6.27	4.41
పెద్దపల్లి	6.34	4.48
రాజన్న సిరిసిల్ల	6.34	4.49
జగిత్యాల	6.34	4.48

గరిష్టం/కనిష్టం 40.0/24.4

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

చల్లని సేవలకు సలామ్



తడారుతున్న గొంతులకు చల్లని నీరందించి ప్రాణాలు నిలుపుతూ.. నీటి జాడల కోసం వెతుకుతున్న పిచ్చుకల కోసం నీటితొట్టెలు పెడుతూ.. అలసిపోయిన ప్రయాణికులకు మజ్జిగ ఇచ్చి సత్తువ నింపుతూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు దాతలు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వేసవిలో పలువురు స్వచ్ఛందంగా చలివేంద్రాలు.. మజ్జిగ కేంద్రాలు.. నీటితొట్లు ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు. ఎండాకాలంలో గుక్కెడునీరుపోసి ప్రాణాలు నిలుపుతున్న మానవతవాదులపై ఈ వారం సండే స్పెషల్.. 8లో▸

న్యూస్‌రీల్

క్రీడల్లో రాణించేవారికి ప్రోత్సాహం



విద్యార్థినులకు చెక్కులు అందజేసిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ, తదితరులు

పెద్దపల్లిరూరల్: బాలికలు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు ప్రదానం చేస్తున్నామని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు శనివారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ.3,300 చొప్పున చెక్కులు అందజేశారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలు క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలానికో విద్యార్థినికి బహుమతులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల శాఖ అధికారి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


రైతులు అధైర్యపడొద్దు



కనగర్తిలో ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

ఓదెల(పెద్దపల్లి): రైతులు అధైర్యపడకుండా పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో ఎండిపోయిన పంటలను శనివారం పరిశీలించారు. ప్రస్తుతం ఎండలు ముదరడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయని, పక్క బావుల సహకారంతో పంటలకు నీటిని పారించుకోవాలన్నారు. ఎస్సారెస్పీ కాలువ నీటిని రైతులు సమపాళ్లలో సద్వినియోగం చేసుకోవాలని, రెండు లేదా మూడు తడులతో పంటలు కోతలకు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో సతీశ్, రైతులు పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న హుండీ ఆదాయం రూ.20లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించినట్లు ఈవో బి.సదయ్య తెలిపారు. మొత్తం రూ.20లక్షల 9వేల 533 ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సింగరేణి గ్రీన్ సిగ్నల్

- ఖాళీ క్వార్టర్లను కూల్చివేస్తున్న యాజమాన్యం
- 88 క్వార్టర్లకు నోటీసులు
- మరో రెండు రోజులే గడువు



క్వార్టర్లను కూల్చివేస్తున్న సింగరేణి సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): 'ఖని'లో వందఫీట్ల రోడ్ల విస్తరణ ప్రక్రియకు సింగరేణి యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ప్రధాన రోడ్డును విస్తరించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు సంస్థ ముందుకు సాగుతోంది. ఈమేరకు శనివారం మూడు క్వార్టర్లను కూల్చివేశారు. మిగతా క్వార్టర్లను దశల వారీగా ఆధీనంలోకి తీసుకుని కూల్చివేస్తామని యాజమాన్యం పేర్కొంది. దీనిలో భాగంగా 88 క్వార్టర్లను గుర్తించిన యాజమాన్యం నెలరోజుల్లోగా ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసింది. వీటిలో కొన్ని యాజమాన్యం ఆధీనంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రోడ్డు ఒకవైపు మొత్తం సింగరేణి క్వార్టర్లను ఉండటంతో వాటిని కూల్చివేసి ప్రభుత్వానికి స్థలం అప్పగించాలని నిర్ణయించింది.

వందఫీట్ల రోడ్డుకు స్థలం

- మొదటి దఫా అర్జున్‌స్వీట్ ముందు నుంచి ప్రధాన చౌరస్తా, చౌరస్తా టూ రీగల్ షూమార్ట్ వరకు ఉన్న క్వార్టర్లను తొలగించాలని నిర్ణయించింది. 36 మీటర్ల వెడల్పు 1,275 మీటర్ల పొడవు మొదటి దఫా విస్తరణకు నిర్ణయించారు.
- రోడ్డు పక్కనే క్వార్టర్లలో ఉంటున్న కార్మికులకు యాజమాన్యం నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం వంద ఫీట్ల మేర రోడ్డు విస్తరించడానికి అనుగుణంగా క్వార్టర్లు, ఇతర కట్టడాలను తొలగించనున్నారు.
- సంస్థ స్థలాల్లో ఉన్న కట్టడాలను యాజమాన్యం, మిగతా ప్రాంతాల్లో ఉన్న కట్టడాలను మున్సిపల్ అధికారుల ద్వారా తొలగించాలని చూస్తున్నారు.

ఆందోళనలో వ్యాపారులు

- నాలుగు దశాబ్దాలుగా రోడ్డు పక్కనే చిన్న షాపులు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారస్తులు జీవిస్తున్నారు. క్వార్టర్లతో పాటు రోడ్డు పక్కన ఉన్న కట్టడాలు కోల్పోతుండటంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.
- పట్టణ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, నష్టపోకుండా ఎమ్మెల్యే స్పష్టమైన హామీ ఇవ్వాలని చిరు వ్యాపారస్తులు కోరుతున్నారు.
- కార్మికులు క్వార్టర్లు కోల్పోతే యాజమాన్యం వేరే క్వార్టర్లు కేటాయిస్తుందని, కానీ షాపులు కోల్పోతే తమ జీవితాలే మారిపోతాయని ఆందోళన చెందుతున్నారు.

సెక్టార్ వన్‌లోనే..



క్వార్టర్లు కోల్పోతున్న కార్మికులకు సెక్టార్ వన్‌లోనే వేరే క్వార్టర్లు సీనియార్టీ ప్రతిపాదికన ఇవ్వాలని యోచిస్తున్నాం. ఇప్పటికి 45 క్వార్టర్లు సెక్టార్ వన్‌లో గుర్తించాం. ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశం సంస్థకు లేదు. నోటీసులు అందుకున్న కార్మికులు త్వరగా క్వార్టర్లు ఖాళీ చేయాలి. రోడ్ల విస్తరణకు కార్మికులు, పట్టణ ప్రజలు సహకరించాలి.

– చింతల శ్రీనివాస్, ఆర్జీ–1 జీఎం

ఎవరికీ నష్టం జరగనివ్వం



మరో రెండు దశాబ్దాల జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టాలని, వాణిజ్య వ్యాపార కేంద్రంగా గోదావరిఖనిని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. రోడ్ల విస్తరణలో షాపులు కోల్పోతున్నవారికి అన్యాయం జరగనీయం. ఈవిషయంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. అందరూ సహకరించాలి.

– ఎంఎస్ రాజ్‌ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

నిందితులకు శిక్ష పడేలా చూడాలి

- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనతో సమగ్ర విచారణ చేపట్టి నిందితులకు శిక్షపడేలా చూడాలని రామగుండం పోలీసు కమిషనర్ మిట్ట శ్రీనివాస్ పేర్కొన్నారు. కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో రెండు జిల్లాల పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి 60రోజుల్లో కోర్టుల్లో చార్జిషీట్ వేయాలని సూచించారు. పలు కేసులపై రివ్యూ నిర్వహించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నిబంధనల మేరకు వ్యవహరించాలి

రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసులు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పని చేయాలని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులందరూ సమష్టిగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మద్యం, నగదు రవాణాను నిరోధించేందుకు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల పోలీస్ అధికారులతో కాంటాక్ట్‌లో ఉంటూ సమచారం ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన, అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని, పెద్దపల్లి, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు రమేశ్, కృష్ణ, ఆర్.ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింహులు, సురేంద్ర, సీఐ, ఆర్ఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

సేవా నిరతిని ప్రపంచానికి చాటిన జీసస్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తదితరులు

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

గోదావరిఖనిటౌన్(రామగుండం): సేవా నిరతిని, త్యాగాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన భగవత్ స్వరూపుడు జీసస్ అని రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. శనివారం పాస్టర్స్ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణంలోని ప్రధాన చౌరస్తా నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు చేపట్టిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, నిరంతరం ప్రజాసేవకే అంకితమని పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళలను ఆకతాయిలు వేధిస్తే పోలీసులకు లేదా తనకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఇతర శాఖల అధికారులు

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలన్నారు. అలాగే 85 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకుంటే వారి ఇంటివద్దకే పోలింగ్ అధికారులు వచ్చి ఓటు వేసే అవకాశం కల్పిస్తారని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు గంగయ్య, హనుమనాయక్, డీఈవో మాధవి, ఏవో శ్రీనివాస్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు, అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షల విభాగం), తదితర అధికారులు, సిబ్బంది పరీక్షలను పర్యవేక్షించి ప్రశాంతంగా జరిగేలా సహకరించారని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద వైద్యసిబ్బంది సేవలందించారని వివరించారు. పరీక్షల నిర్వహణలో సహకరించిన అందరికీ డీఈవో కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ పాలనలోనే రైతులకు మేలు

- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



దీక్షలో ఎంపీ అభ్యర్థి కొప్పుల, బీఆర్ఎస్ నేతలు

పెద్దపల్లిరూరల్: కేసీఆర్ పాలనలోనే రైతులకు మేలు జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వారిని అరిగోస పెడుతోందని, వరిపంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు అన్నీఇన్నీ కావని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో శనివారం రైతులకు మద్దతుగా చేపట్టిన 36గంటల దీక్షను ప్రారంభించి మాట్లాడారు. వరి సాగుచేసిన రైతులకు పంట చేతికందే దశలో సాగునీరందని పరిస్థితి ఏర్పడడంతో ఆందోళనలో పడ్డారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులే ఇప్పటి కాంగ్రెస్ పాలనలో ఏర్పడ్డాయన్నారు. సాగు నీరందక ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల పరిహారం అందించాలన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు అనేక పథకాలను అందించి అండగా నిలిచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేసే వరకు బీఆర్ఎస్ అండగా ఉండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి, భూపాలపల్లి జెడ్పీ చైర్మన్లు పుట్ట మధు, జక్కుల హర్షిణి, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, దివాకర్‌రావు, సుమన్, నాయకులు కౌశిక హరి, రఘువీర్‌సింగ్, దాసరి ఉష, పట్టణ, మండల అధ్యక్షులు ఉప్పు రాజ్‌కుమార్, మర్కు లక్ష్మణ్, జెడ్పీటీసీలు రామలు, లక్ష్మణ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ–1 సీహెచ్‌పీ పనితీరు భేష్

- సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఅండ్ఎండీ బలరాం

గోదావరిఖని(రామగుండం): బొగ్గు రవాణాలో ఓసీపీ–1 సీహెచ్‌పీ ఉద్యోగుల పనితీరు భేష్ అని సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాం అభినందించారు. శనివారం ఓసీపీ–1 సైలోబంకర్‌ను సందర్శించారు. బంకర్ విస్తరణ, బొగ్గు రవాణా తీరు తెలుసుకున్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతిఒక్కరూ పాటు పడాలని సూచించారు. భారీ యంత్రాలను సద్వినియోగం చేసుకొని ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. సీఅండ్ఎండీ వెంట ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, ఏరియా ఇంజినీర్ ఎలీషా, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, అధికారులు శ్రీనివాస్, కాశీవిశ్వేశ్వర్‌రావు, వెంకటరమణ, ఉదయ్‌హరిజన్, సత్యనారాయణ ఉన్నారు.

పెద్దపల్లి గడ్డపై బీజేపీ జెండా ఎగరేద్దాం




అభివాదం చేస్తున్న ప్రదీప్‌కుమార్, శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: ప్రపంచవ్యాప్తంగ ప్రధాని నరేంద్ర మోదీ హవా నడుస్తోందని, జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హ్యాట్రిక్ నమోదు చేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలో శనివారం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించి గడ్డం వివేక్‌వెంకటస్వామి కుటుంబ రాజకీయాలకు చెక్ పెట్టాలన్నారు. పెద్దపల్లి గడ్డపై బీజేపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు.

ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపుతా

తనను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెద్దపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతానని గోమాస శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఒకే కుటుంబానికి కట్టబెట్టడాన్ని ఎస్సీలంతా వ్యతిరేకిస్తున్నారని, ఈ ఎన్నికల్లో ఓటమితో వివేక్ కుటుంబానికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. అనంతరం పెద్దపల్లిలోని శివాలయం నుంచి మెన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, వెంకటేశం, లక్ష్మణ్, చిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న సేఫ్టీ జీఎం గురువయ్య

గోదావరిఖని: సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ కచ్చితంగా అమలు చేయాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య పేర్కొన్నారు. శనివారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–1,3గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రక్షణ విషయంలో రాజీ లేకుండా ముందుకు సాగాలన్నారు. సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ తయారీకి గైడ్ లైన్‌లు, నియంత్రణ విధానాలు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలన్నారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, గ్రూప్ ఏజెంట్ సైదులు, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, ఓదెలు, రమేశ్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.









పరీక్షలు ముగిశాయ్.. భారంగా బై బై..

పెద్దపల్లిరూరల్/జ్యోతినగర్/సుల్తానాబాద్: పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులంతా శనివారం పరీక్షలు ముగియడంతో తమ పేరెంట్స్‌తో ఇంటిబాట పట్టారు. భారమైన హృదయంతో బై..బై.. అంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. మళ్లీ ఎన్నాళ్లకు.. ఎక్కడ కలుసుకుంటామో.. భవిష్యత్తులో ఉన్నత చదువులు ఎక్కడ చదవాల్సి వస్తుందో..నంటూ కొంత సేపు తల్లిదండ్రుల సమక్షంలోనే కులాసా కబుర్లు చెప్పుకొని ఇళ్లకు వెళ్లిపోయారు.

క్లుప్తంగా

బావిలో దూకిన వృద్ధురాలు

● కాపాడిన దివ్యాంగుడు



వృద్ధురాలిని బయటకు తీస్తున్న రవి



యువకుడు రవి

శంకరపట్నం: ఓ కాలు సరిగా పని చేయకున్నా బావిలో దూకిన వృద్ధురాలిని కాపాడి శభాష్ అనిపించుకున్నాడు ఓ దివ్యాంగుడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శనివారం ఓ వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బావి సమీపంలో నివాసముంటున్న బండారి రవి అనే దివ్యాంగుడు గమనించి కాపాడాడు. వృద్ధురాలు కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. బావిలో దూకిన గడ్డం మల్లీశ్వరి(68)ని కాపాడేందుకు చెట్టు కొమ్మలు పట్టుకొని బావిలో దిగిన రవి నీటమునుగుతున్న మల్లీశ్వరిని రక్షించాడు. బావి వద్ద గుమిగూడిన ప్రజలు తాళ్ల సహాయంతో బావి నుంచి బయటికి తీశారు. వృద్ధురాలికి ఇద్దరు కుమారులున్నారు. వెంటనే 108 వాహనానికి సమాచారమందించి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్మీ సోల్జర్ ఆత్మహత్య



నెల్లి రామకృష్ణ(ఫైల్)

సైదాపూర్: దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన సైనికుడు నెల్లి రామకృష్ణ(27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, మృతుని బంధువులు తెలిపిన వివరాలు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొడిశాలకు చెందిన నెల్లి తిరుపతి–స్వరూప దంపతుల కుమారుడు రామకృష్ణ ఆర్మీలో ఐదేళ్లుగా సైనికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండు నెలల క్రితం స్వగ్రామం వచ్చి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులతో చెప్పినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగియగానే గదిలోకి వెళ్లిన రామకృష్ణ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం స్వగ్రామానికి శనివారం చేరుకుంటుందని అక్కడి అధికారులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. రామకృష్ణ మృతిపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామకృష్ణ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతున్ని కోరారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

ముత్తారం(మంథని): ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ముత్తారంలో శనివారం వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ బోల్తాపడి జంబు శ్రీనివాస్(45) దుర్మరణం చెందాడు. ముత్తారంలో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డుకు వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదం జరిగింది. సంఘటన స్థలాన్ని ఎస్సై మధుసూదన్‌రావు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య దేవక్క, కొడుకు మధుకర్, కూతురు నిరోష ఉన్నారు.

చల్లని సేవలకు సలామ్

● చలివేంద్రాలతో దప్పికతీరుస్తున్న దాతలు
● పక్షులకు నీళ్లు పెడుతున్న ప్రేమికులు
● ఏళ్లుగా సమాజసేవతో సంతృప్తి
● ఆదర్శం చిరువ్యాపారుల సేవాస్ఫూర్తి

సండే స్పెషల్

మండే వేసవిలో తడారుతున్న గొంతులకు తాగునీరు అందించే వారు కొందరు. నీటి జాడ కనిపించని పక్షుల కోసం డాబాలపై నీటితొట్టీలు పెట్టేవారు మరికొందరు. తాహతమకు మించినప్పటికీ కూలీలు.. బాటసారుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు ఇంకొందరు. అందరి ఉద్దేశం సమాజసేవే.. నిండు వేసవిలో గుక్కెడు నీటి కోసం తండ్లాటే మనుషులకు గ్లాసు నీళ్లందించి ప్రాణాలు నిలుపుతున్నారు. భానుడి ప్రతాపానికి విలవిల్లాడే పక్షులకు నీటి తొట్టీలు పెట్టి వాటి మనుగడకు సాయం చేస్తున్నారు. ఇలా.. నిండు వేసవిలో చల్లటి నీటితో ఆప్యాయతలు పంచుతున్న దాతలపై ప్రత్యేక కథనం...

పక్షుల కోసం వాటర్‌ఫౌంటేన్



కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి సంస్థ ఓసీపీ–2లో సేఫ్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ ఆసిఫ్, ఆయన భార్య ఫర్వీన్‌కు పక్షులు, జంతువులు ఉంటే ప్రేమ. స్థానిక విఠల్‌నగర్‌లో ఉంటున్నారు. వేసవిలో పక్షుల దాహార్తి తీర్చేందుకు గత ఎనిమిదేళ్లుగా వారి ఇంటి ఆవరణలో తొలత మట్టి తొట్లు ఏర్పాటు చేశారు. అయితే తొట్టిల్లోని నీరు వేడి అవుతుండడంతో వాటర్‌ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఒక డ్రమ్ములో చల్లటి నీటిని పోసి, అందులో కూలర్ మోటార్‌ను పెట్టి.. వాటర్ ఫౌంటేన్‌గా తయారు చేశారు. దీన్ని వారి ఇంటిలోని చెట్ల కింద పెట్టి ఫౌంటేన్‌లా నీళ్లు పైకి చిమ్మేలా ఏర్పాట్లు చేశారు. ఇలా పైకి చిమ్మే నీటిలో పక్షులు ఎంచక్కా ఆడుతూ.. చల్లని నీటిని తాగుతున్నాయి. అంతేకాకుండా పక్షుల కోసం ప్రత్యేకమైన ఆహారం తీసుకొచ్చి చెట్లకింద చల్లుతుంటారు.

15 ఏళ్లుగా దాహం తీరుస్తూ..



రాచర్లగొల్లపల్లిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న లయన్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండు వేసవిలో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో 15 ఏళ్ల క్రితం 12 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు కలిసి మైత్రి పరివార్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చుతున్నారు. 'నీళ్ల దానం మహాదానం' అనే నానుడిని అనుసరించి ఏటా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మైత్రి పరివార్ అనంతరం అదే సంస్థలోని సభ్యులు లయన్స్ క్లబ్‌గా ఏర్పడి ఆ సేవలను కొనసాగిస్తున్నారు. లయన్ కోట సతీశ్ సహకారంతో ప్రతీ ఏడాది మార్చి 15 నుంచి జూన్ 10 వరకు రూ.50వేలు ఖర్చుచేసి తాగు నీటితోపాటు మజ్జిగను అందిస్తున్నారు.

సామాజిక సేవతో సంతృప్తి



సామాజిక సేవలో సంతృప్తి ఉంటుంది. వేసవిలో ప్రజలకు తాగు నీటిని అందించాలనే సంకల్పంతో 12 మంది ఉపాధ్యాయులం కలిసి మైత్రి పరివార్‌ను ఏర్పాటు చేశాం. గత 15 ఏళ్లుగా రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ప్రతీ వేసవిలో నిరంతరం కొనసాగిస్తాం.

– ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సభ్యుడు, ఎల్లారెడ్డిపేట

పక్షుల సేవలో కుటుంబం



కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని కాకతీయనగర్‌కు చెందిన బోళ్ల చంద్రశేఖర్–పావని దంపతులు పక్షి ప్రేమికులు. చంద్రశేఖర్ ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. తమ ఇంట్లోని ఏసీ కంప్రెషర్ల నుంచి కారే నీటిని పక్షుల తాగడాన్ని చూసి చంద్రశేఖర్ చలించిపోయాడు. వెంటనే పక్షుల కోసం తమ డాబాపై ప్రత్యేకంగా నీటితొట్లు ఏర్పాటు చేశారు. గత నాలుగేళ్లుగా ఏటా వేసవిలో తమ డాబాపై, వరండాలో తల్లి శ్రీలతతో కలిసి చంద్రశేఖర్ దంపతులు మట్టితొట్లలో నీళ్లు పెడుతున్నారు. వాటి ఆకలి తీర్చేందుకు మరో తొట్టిలో గింజలు పోస్తున్నారు.

స్నేహితుడి కోరిక మేరకు..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌కు చెందిన సయ్యద్ ఖాలిద్ స్థానిక చౌరస్తాలో పదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఖాలిద్ గల్ఫ్‌లో ఉన్న సమయంలో స్థానికంగా తాగునీటి గోస ఉండేది. ఆ రోజుల్లో తన మిత్రుడు, స్థానిక న్యాయవాది ఉప్పు రాజు కోరిక మేరకు ప్రగతినగర్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా వేసవిలో ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఎండలు ముదరడంతో ప్రస్తుతం ఇక్కడే ఉంటున్న సయ్యద్ ఖాలిద్ త్వరలోనే చలివేంద్రం ఏర్పాటు చేస్తానని తెలిపారు.

బాటసారుల సేవలో..



నీళ్లందిస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో పదహారేళ్లుగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఏటా వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు జెండా ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వివిధ పనుల కోసం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు, ప్రయాణికులు, కూలీల సేవలో తరిస్తున్నారు. దినసరి కూలీలకు ఎండ నుంచి రక్షణకు టోపీలు అందిస్తున్నారు.

ఆదర్శం కూరగాయల వ్యాపారి



జూలపల్లిలో ఏర్పాటు చలి వేంద్రం

పెద్దపల్లిరూరల్: మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నిరుపేద యువకుడు ఆతిక్ పాషా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభిమాని. కూరగాయలు విక్రయించే ఆతిక్‌పాషా ఏటా వేసవిలో దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకార్థం స్థానిక మందోట వద్ద చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాడు. ఎవరి నుంచి రూపాయి ఆశించకుండా కూరగాయలు విక్రయిస్తే వచ్చిన లాభాల నుంచే కొంత మొత్తం సమాజసేవకు వెచ్చిస్తున్నాడు. ఆతిక్‌పాషా స్వస్థలం జూలపల్లి. చిన్న తనంలోనే తండ్రి అనారోగ్యంతో చనిపోగా.. తల్లి కష్టపడి పెంచింది. ప్రతీ రోజు వారసంతల్లో కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు.

పక్షి ప్రేమికుడు



పక్షుల కోసం నీటిని, గింజలను ఏర్పాటు చేసిన అనంతుల రమేశ్

విద్యానగర్: కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన అనంతుల రమేశ్ పక్షి ప్రేమికుడు. తండ్రి రైతు కావడంతో ఆయన పక్షుల కోసం ఇంటి చుట్టూ వాసాలు, గుంజలకు వరి గొలుసులు వేలాడదీసేవాడు. మట్టి పాత్రల్లో నీళ్లు ఉంచేవాడు. దీంతో ఇంటి పరిసరాలు పిచ్చుకల కిచకిచ రావాలతో సందడిగా ఉండేది. తండ్రి వారసత్వాన్ని రమేశ్ కొనసాగిస్తున్నాడు. పదేళ్లుగా ఇంటిచుట్టూ పల్లె వాతావరణం ఏర్పాటు చేసి పిచ్చుకల కోసం వరి గింజలు, నీటి కోసం ప్రత్యేక పాత్రలు ఏర్పాటు చేసాడు. దీంతో ఆయన ఇంటి చుట్టూ పగలు, రాత్రి తేడాలేకుండా సందడి చేస్తుంటాయి.

జంతు స్నేహితుడు



బోయినపల్లి: సైకిల్‌పై వస్తున్న ఆయనను చూడగానే కుక్కలు తోకాడించుకుంటూ వస్తాయి. కవర్‌లో బిస్కెట్లు తీసేవరకు ఎదిరి చూస్తాయి. బిస్కెట్లు వేయగానే ఆనందంగా తింటాయి. పక్కవాడు ఆకలితో గోస పడుతున్న పట్టించుకోని ఈ రోజుల్లో బోయినపల్లిలో సుబ్బారావు కుక్కలకు చేను పరిసరాల్లో బిస్కెట్లు ఇస్తున్నాడు. 15 ఏళ్ల క్రితం ఆంధ్రా నుంచి వచ్చిన ఈయన బోయినపల్లిలో భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తాడు. నాలుగేళ్ల క్రితం కోవిడ్ సమయంలో ఆహారం దొరకక అల్లాడిన కుక్కలను చూసి చలించిపోయినట్లు చెప్పారు.

మనసున్న చిరువ్యాపారులు..

జగిత్యాలటౌన్: వారంతా చిరువ్యాపారులే. రూపాయి.. రూపాయి జమచేస్తేనే వారి కుటుంబాలను వెల్లదీసుకోగలరు. కానీ తమ వంతుగా వేసవిలో కష్టమర్లు, ప్రయాణికుల దాహార్తి తీర్చాలనే కోరికతో మినీచలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా తమ తాహతుకు మించినప్పటికీ ప్రయాణికులు, వినియోగదారుల దాహార్తి తీర్చడంలోనే తమకు తృప్తి ఉందంటున్నారు.

15 ఏళ్లుగా..



మంచి చేయాలనే సంకల్పంతోనే నా పండ్ల బండి వద్ద చల్లని నీటి డబ్బాను పెడుతున్నాను. గత 15 ఏళ్లుగా ప్రయాణికుల దాహార్తి తీర్చుతున్నాను. రోజుకు ఐదు నుంచి ఆరు డబ్బాల నీటిని అందిస్తున్నాను. నాకెంతో సంతృప్తినిస్తుంది.

– అబ్దుల్ బాసిద్ పండ్ల వ్యాపారి. జగిత్యాల

కస్టమర్ల కోసం..



నాకు ఉపాధి కల్పిస్తున్న కస్టమర్ల కోసం నీటి డబ్బాను ఏర్పాటు చేస్తున్న. గత పదేళ్లుగా మినీ చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఎండలో వచ్చే వారి దాహం తీర్చడం ఎంతో సంతృప్తినిస్తుంది.

– చేని నాగరాజు, తాళం చెవుల తయారీ, విక్రయదారు

మానవ సేవే.. మాధవ సేవ



మనుషులకు సేవ చేస్తే భగవంతునికి చేసినట్లే. అందుకే కొన్నేళ్లుగా జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. సత్యసాయిబాబా సందేశం స్ఫూర్తితోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– బట్టు రాజేందర్ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ జగిత్యాల

పక్షుల దాహార్తి తీర్చండి



బహుదూర్‌ఖాన్‌పేట పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన డబ్బాలో నీళ్లు పోస్తున్న పంచాయతీ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: ఎండలు మండుతున్నాయి. వచ్చే రెండు నెలల్లో తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముందస్తుగా స్పందించిన కరీంనగర్ కలెక్టర్ పమేల సత్పతి.. పశువులు, పక్షుల కోసం పల్లెప్రకృతి వనాల్లో నీళ్లు, దాణా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పక్షులు, పశువులకు తాగు నీటి సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు చెట్లకు ఏర్పాటు చేశారు. పక్షుల ఆహారం కోసం ధాన్యం, మొక్కజొన్న, బియ్యం అందుబాటులో ఉంచారు. పశువుల దాహార్తి తీర్చడం కోసం నీటితొట్టిలు అందుబాటులోకి తెచ్చారు. వేసవికాలం పూర్తయ్యే వరకూ ఈ ప్రక్రియ కొనసాగాలని డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలను కలెక్టర్ ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

14 మంది మహిళల బైండోవర్

వేములవాడ: వేములవాడలోని మహాలక్ష్మి వీధిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో కొన్ని గృహాలపై డీఎస్పీ నాగేంద్రచారి, శిశు సంక్షేమశాఖ అధికారులతో కలిసి శనివారం దాడులు చేశారు. వ్యభిచార వృత్తిని కొనసాగిస్తున్న 14 మంది మహిళలను ఠాణాకు తీసుకొచ్చారు. అక్కడే వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

జ్యోతిష్మతిలో 'ఉత్సవ్– 2024'

తిమ్మాపూర్: జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కాలేజీ వార్షికోత్సవం శనివారం ఉత్సవ్–2024 పేరుతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (డీఆర్‌ఎంఎల్) మాజీ డైరెక్టర్ డాక్టర్ జి.మధుసూదన్ రెడ్డి, వరంగల్ చీఫ్ ఇన్వెస్టిగేటర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీసీ అకాడమీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) సీఎస్‌ఈ విభాగం ప్రొఫెసర్ ఆర్‌బీవీ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతిష్మతి కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా దూసుకెళ్లాలన్నారు. కంపెనీలు స్థాపించి ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలన్నారు. కళాశాలలో చేరిన ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, అకాడమీ ఆడిట్ డీన్ డాక్టర్ పీకే వైశాలి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పి. సంపత్ రావు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



మాట్లాడుతున్న సాగర్‌రావు



మనవడిపై తాత హత్యాయత్నం

● నిద్రిస్తున్న సమయంలో గొడ్డలితో దాడి
● ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం



మహేశ్

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన సామంతుల మహేశ్ (28)పై తాత సామంతుల కొమురయ్య హత్యాయత్నం చేశాడు. ఎస్సై సత్యనారాయణ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురయ్యకు కుమారుడు మల్లేశం, కూతురు కనుకవ్వ సంతానం. మల్లేశంకు వివాహమై ఇద్దరు కుమారులు జన్మించిన తరువాత దాదాపు 20ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. దీంతో అతడి కుమారులిద్దరు అశోక్, మహేశ్‌ను కొమురయ్య పెంచి పెద్దచేశాడు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేసి వారికి తన వ్యవసాయ భూమిని పంపకం చేశాడు. కాగా మహేశ్ తరచూ తాగి వచ్చి తాతతో గొడవపడేవాడు. తన అన్న అశోక్‌కు ఎనిమిది గుంటల భూమి ఎక్కువ ఇచ్చావని దూషిస్తూ బెదిరించేవాడు. ఈ క్రమంలో మహేశ్‌తో ఎప్పటికైనా తనకు ఇబ్బందులు తప్పవని కొమురయ్య భావించాడు. ఇంటి ముందు పడుకున్న మహేశ్‌పై శనివారం వేకువజామున గొడ్డలితో దాడి చేశాడు. ఇంట్లో నిద్రిస్తున్న అతడి తల్లి, భార్యకు మెలకువ వచ్చి బయటకు రావడంతో కొమురయ్య గొడ్డలిని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ఘటనపై మహేశ్ మేనమామ కట్ట కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మహేశ్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్ తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.